
అతనికి ఎండలన్నా, మల్లెలన్నా యిష్టం. స్వప్న అంటే మరీ మరీ యిష్టం. స్వప్న స్వరం స్వప్నంలో వినిపించే మధుర గానంలా ఉంటుం దతనికి. నిజానికతను స్వప్నను ప్రేమించలేదు. అతను కలలుగన్న ఊహా సుందరీ ఆమె కాదు. తమాషా ఏమిటంటే స్వప్నను చూసిన క్షణం, ఆ పైన కొద్ది మాసాల హడావిడీ, ఆర్భాటం తర్వాత ఓ అద్భుతమైన సుము హూర్తపు క్షణంలో అతని కౌగిలిలో స్వప్న పరిమళించింది. ఆ కౌగిలి పరిమళం యిప్పటికీ, మూడు సంవత్సరాలకు పైగా గడిచిపోయినా గుబాళిస్తూనే వుంది.

మంచి రోహిణి కార్తె పగిలే వేసవిలో హర్షకీ, స్వప్నకీ పెళ్ళయింది. స్వప్న కాలేజీలో చదివే రోజుల్లో 'ప్రేమ' అనే రెండక్షరాల మహా మాయలో చిక్కుకో లేదు. తను ఎవరినీ - ఎవరూ తననీ ఆకర్షించ లేదు. అదే విచిత్రం!

'అసలు స్త్రీ - పురు షులు ఒకరినొకరు ప్రేమిం చుకోరు. ఎవరో ఒకరే ప్రేమి స్తారు. ఎదుటివారు దాన్ని అంగీకరిస్తారు - అంతే' అన్న సిద్ధాంతాన్ని గట్టిగా నమ్మిన వ్యక్తి హర్ష. అందుకే స్వప్నను పెళ్ళి చేసుకున్నాక ప్రపంచంలో యింతకంటే ఎవరూ ఎవర్నీ ప్రేమించ లేరు అన్నంతగా హర్ష ఆమెను ప్రేమిస్తున్నాడు.




అంగనామణి కురుల్లో విరిసిన సింథటిక్ సుమ హారాల వంటి మహా నగ రాలు, నాన్ గెజిటెడ్ ఆఫీ సర్ల పాలిట మృత్యు గవ్హా రాలు. జీవితం అందంగా, ఆనందంగా మన ఊహ లలో కనీసం పదో వంత యినా సాఫీగా సాగాలంటే భార్యా భర్తలు యిద్దరూ ఉద్యోగం చెయ్యక తప్పని రోజులివి. ఈ విషయం హర్షకు బాగా తెలుసు. అయినా స్వప్నను ఉద్యో గస్తురాలి హెూదాలో చూడ డానికి అతని మనసు అంగీకరించడం లేదు.

పొద్దున్నే కాఫీ తాగుతూ సరదాగా కబుర్లు చెప్పుకునే క్షణాలు కూడా దొరకవని అతని గట్టి నమ్మకం. కాలం యింట్లో మనచేత పరుగులు పెట్టిస్తుందని కచ్చితమైన లెక్కలతో అతను వాదిస్తాడు. లేచినప్పటి నుంచి ఉరుకులు, పరుగులు. 'కాస్త రెండోసారి విజిల్ రాగానే కుక్కర్ దింపి, ఆ పెనం స్టౌవ్ మీద పెట్టండి' అంటూ పరుగులాంటి నడకతో బాత్‌రూమ్‌లో దూరడం' హర్షకు చిరాకు అనిపిస్తుంది. అతనికి వచ్చే జీతం రెండువేలు మించదు. చిన్న చిన్న ఆర్థిక యిబ్బందులు తప్పవు. అయినా స్వప్నను ఉద్యోగం విషయంలో ఒత్తిడి చెయ్యలేదు. ఒకటి రెండుసార్లు స్వప్న ఆ విషయం కదిపినా దాటవేశాడు.

స్వప్న విషయం గోపీ ప్రస్తావించినప్పుడు, ఖచ్చితంగా 'కుదరదు' అని చెప్పకపోవడం హర్ష బలహీనత. ఆ బలహీనతకు కారణం వాళ్ళిద్దరూ మంచి స్నేహితులు అవడం. గోపి నేటి కమర్షియల్ సివిలిజేషన్‌ని బాగా జీర్ణించుకున్న వాడు. దేవుణ్ణీ, దెయ్యాన్నీ, కరెన్సీనీ, సెంటిమెంట్‌ని తన అవసరానికి తగినట్లు ఉపయోగించి, పనులు చేసుకోడంలో గోపీ నెంబర్ వన్. అతను ఎక్స్ పోర్ట్ బిజినెస్ ప్రారంభించ డంతో, వివిధ స్థాయిల్లోని వ్యక్తులను అందంతో, వాక్చాతుర్యంతో ట్రాప్ చేసే వ్యక్తుల కోసం వేటాడు తున్నాడు. అతని దృష్టిలో స్వప్న పడింది. స్నేహం అనే సెంటిమెంట్ వల విసిరి హర్షను తర్వాత నీదే బాధ్యత అని వదిలేశాడు. గత పది రోజులుగా హర్ష ఆ వలలో గిలగిలలాడు తున్నాడు. స్వప్నతో ఆ విషయం ఎలా కదపాలో, ఎలా ఒప్పించాలో తెలి యక మధనపడుతున్నాడు.

వేసవిలో నిండుగా విర బూసిన మల్లె పందిరిలా మంచం మీద పడుకుని వుంది స్వప్న. తదేకంగా, తన్మయత్వంతో ఒకరినొ కరు చూసుకుంటున్నారు. కొంతసేపటికి హర్ష తేరు కుని' ఆ గోపీగాడు నెల రోజుల నుంచి నా ప్రాణాలు తోడేస్తున్నాడు. కొత్తగా పెట్టిన వాడి కం పెనీలో నీలాంటి వాళ్ళ అవసరం ఎంతో ఉందట' అన్నాడు.

'దేశంలో నిరుద్యో గులు గజానికొకడూ ఉన్నాడు. 'కావలెను' అంటూ ఓ ప్రకటన యిస్తే వాళ్ళ ఆఫీసు దగ్గరనుంచి మెక్ మోహన్‌రేఖ దాకా జనం క్యూలో నిలబడ తారు. మీరేం కంగారు పడకండి. ఆ గోపీ గార్ని ప్రయత్నించమనండి' అంది స్వప్న చాలా తేలికగా.

'నేను కూడా ఉద్యోగం చేస్తే బాగుంటుంది కదాని నువ్వు అంటూం టావు కదా! ఏదో సందర్భంలో ఆ మాట వాడితో అన్నాను. ఇక దాన్ని పట్టుకుని వదలడం లేదు.'

'నాకంటే ముందు నుండి గోపీ మీకు తెలుసు. మీరిద్దరూ స్నేహితులు. మీమధ్య నా గురించిన ప్రస్తావన రావడం నాకు యిష్టం లేదు' అంది

స్వప్న.

చిరాకుని కనిపించనీయకుండా 'అది సరే స్వప్నా! మరి ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి?' అన్నాడు.

'సమస్యా?.మీకా, గోపీకా? లేక నావల్ల మీ యిద్దరికీనా? వెరీ సిల్లీ' అంటూ మంచం దిగి వంటింటిలోకి వెళ్ళింది స్వప్న.

ఈ విషయం యిప్పుడు యింతకంటే సాగదియ్యడం మంచిది కాదన్న నిర్ణయానికి వచ్చాడు హర్ష.

'హలో వస్తూ వస్తూ ఆ చేత్తోనే అగ్గిపెట్టె పట్రావోయ్' అంటూ కేకలేశాడు.

అగ్గిపెట్టె కోసం చెయ్యి జాపిన హర్షకు మజ్జిగ గ్లాసు అందిస్తూ 'ఆలోచించి ఆలోచించి మీ బుర్ర వేడెక్కి పోయి ఉంటుంది. మజ్జిగ తాగి చల్లబరచండి' అంది స్వప్న మంచం మీద కూర్చుంటూ.

హర్ష మజ్జిగ తాగి మరేం మాట్లాడకుండా లైట్ ఆర్పేశాడు.

బెడ్‌లైట్ కాంతిలో హర్షవైపు తిరుగుతూ, 'నిజం చెప్పండి యివాళ ఎన్ని సిగరెట్స్ కాల్చారు?' అంది స్వప్న.

హర్ష సమాధానం చెప్పకుండా ఆమెను దగ్గరగా తీసుకున్నాడు.

☆ ☆ ☆ ☆

సుమారు రాత్రి 7 గంటల సమయంలో విసుగ్గా గడియారం వైపు చూసిన హర్షకు ఉదయం ఆఫీసుకు వెళుతూ స్వప్న చెప్పిన మాటలు గుర్తు వచ్చాయి. నవ్వుతూ వంటింట్లోకి వెళ్ళాడు.

స్వప్న ఉద్యోగంలో చేరి సంవత్సరం కాబోతోంది. గోపీ తన ఎక్స్‌పోర్ట్ బిజినెస్‌లో ఈ సంవత్సర కాలంలో నిలదొక్కుకో గలిగాడు. ఇంత తక్కువ సమయంలో యింతటి గుర్తింపు రావడానికి ముఖ్య కారణం స్వప్న అన్నాడు రెండు మూడు సందర్భాల్లో హర్షతో.

స్వప్న నెలకు రెండు వేలు తెస్తున్నా, యింతకు ముందులా యిద్దరూ సరదాగా గడిపిన రోజులు తక్కువనే చెప్పాలి. ఏదో తెలియని అసంతృప్తి యిద్దరిలోనూ ఉంది. రోజూ ఊరగాయ తిన్నట్టు జీవితం రొటీన్ అవడం ఆ అసంతృప్తికి మొదటి కారణమని హర్షకు తెలుసు. మొదటి నెల జీతం అందుకున్న రోజు స్వప్న 'హేపీ మనీ ఫర్ యు' అంటూ హర్ష చేతిలో కవరు పెట్టినప్పుడు, తెల్లబోయిన అతన్ని చూస్తూ -

'ఈ డబ్బుని మనం సరదాగా ఖర్చు చేద్దాం. ఇది నా తొలి సంపాదన బాపతు తొలి కోరిక - తీర్చవా?' అంది గోముగా.

"దీంతో ఓ జత గాజులు చేయించుకోవచ్చు కదా?" అన్నాడు హర్ష.

'మాస్టారూ! జీవితం యింకా చాలా వుంది. ఇది నా మొదటి జీతం. మీరేం మాట్లాడకండి' అంటూ స్వప్న బలవంతం చేసింది.

అంతే! అప్పటినుంచి యిప్పటివరకు ఈ పదకొండు నెలల్లో ఏ నెలలోనూ గట్టిగా వంద రూపాయలు వెనకెయ్యలేదు. మొగుడూ పెళ్ళాలిద్దరూ నాలుగు చేతులా సంపాదిస్తున్నారా అంటూ ఉరుము లేని పిడుగులా వచ్చి పడే బంధువర్గం. విసుగ్గా వుంది ఈ హాలీడే బయట హొటల్లో తిందాం అనుకుని రిలాక్స్ అయిపోవడం కూడా కరెన్సీకి రెక్కలు రావడానికి కారణం.

సంసారిక జీవితంలో ఏ రోజును గుర్తు చేసుకున్నా, ఓ అద్భుతమైన కలగా కళ్ళ ముందు కదలాడాలని హర్ష కోరిక. అటువంటి రోజులూ, క్షణాలు స్వప్న ఉద్యోగిని కాకముందే చాలా ఉన్నాయి.

వంట అయిందనిపించి హాల్లోకి వచ్చి కూర్చున్నాడు హర్ష. గతంలోకి వెళ్ళి వర్తమానాన్ని చూస్తే ఏదో తెలీని నిస్పృహ, చిరాకు. విసుగ్గా అటూ యిటూ తిరుగుతూండగా రాత్రి 9 గంటల సమయంలో స్వప్న వచ్చింది.

భోజనం చేస్తున్నప్పుడు 'మిమ్మల్ని చాలా యిబ్బంది పెడుతున్నాను సారీ' అంది స్వప్న.

'నాకేం యిబ్బంది లేదు కాని నా వంట తినడం నీకే యిబ్బంది' అన్నాడు హర్ష.

'మీరు మాత్రం వేపుడు కూరలు కడు బ్రహ్మాండంగా చేస్తారు. ఓ మంచిరోజు చూసి చక్కని అట్లకాడ ఒకటి బహుమతి ఇస్తాను. మీరు కాదనకూడదు' అంది నవ్వుతూ స్వప్న.

"ఆఫీసులో పని ఎక్కువగా ఉందా?" అన్నాడు హర్ష ఠంగ్‌మని గంట కొట్టిన గడియారం వైపు చూస్తూ.

'అదేం లేదు. రొటీన్. కాకపోతే ఫస్ట్ ఏనివర్సరీ కదా? ఏదో ప్రోగ్రాం పెట్టాడు గోపీ. అదీ ఈ హడావుడి."

'ఎప్పుడట?'

"మరో పది రోజుల్లో. ఆ ఫంక్షన్ అయ్యాక నేను వారం రోజులు లీవ్ పెడుతున్నాను.'

'థాంక్స్' అన్న హర్ష వైపు ఎందుకు అన్నట్టు చూసిన స్వప్నతో 'ఆ వారం రోజులైనా హేపీగా గడపచ్చు కదాని' అన్నాడు.

కొన్ని క్షణాలు రెప్ప వాల్చకుండా హర్ష వైపు చూస్తూండిపోయింది స్వప్న.

☆ ☆ ☆ ☆

'నిన్న ఫంక్షన్ చాలా అద్భుతంగా జరిగింది. ఐ యామ్ వెరీ వెరీ హేపీ. నా యీ ఆనందంలో తొంభయి శాతం మీకే చెందుతుంది. ఎందు కంటే ఈ బిజినెస్ యింతగా అభివృద్ధి చెందడానికి మీరూ కారణం' అన్నాడు మర్నాడు ఆఫీసులో తనను కలిసిన స్వప్నతో గోపీ.

'థాంక్స్. మీరు చాలా ఎక్సైట్ అయి మాట్లాడుతున్నారు. అన్నట్టు మీకు నేను ముందుగానే చెప్పినట్లు రేపటి నుంచి వారం రోజులు లీవ్ పెడుతున్నాను' అంటూ లీవ్ లెటర్‌ను అందించింది స్వప్న.

దాన్నోసారి చదివి, డ్రాయర్‌లోంచి చెక్‌బుక్ తీసి సంతకం చేసి స్వప్నకి అందిస్తూ, 'మీకు యివ్వవలసిన బోనస్ నలభై ఎనిమిది గంటలు ఆలస్యంగా అందచేస్తున్నాను సారీ' అన్నాడు గోపీ.

చెక్‌లోని అంకె చూసి ఆశ్చర్యపోతూ, 'ఎనిమిది వేలా? మన స్టాఫ్‌కి రెండు నెలల జీతమే కదా బోనస్‌గా అనౌన్స్ చేసింది' అంది.

'మీకు రెండు నెలలకు నాలుగు వేలు, నా పర్సనల్‌గా మీరంటే అభిమానంతో నేనిస్తున్నది మరో నాలుగు వేలు. దట్సాల్.'

కొంత అసహనంగా, యిబ్బందిగా కుర్చీలో కదిలిన స్వప్నను చూస్తూ 'చూడండి స్వప్నగారూ! నేనూ, హర్ష మంచి స్నేహితులం. ఆ రకంగా మీరు నాకు దగ్గరివారు. మీలాంటి వాళ్ళు మన కంపెనీలో ఉండడం నా అదృష్టం. బిజినెస్, మీరు నా దగ్గర పనిచేస్తున్నారు అన్నది పక్కన పెడితే వ్యక్తిగతంగా మీరంటే నాకు ఎంతో యిష్టం...."

కుర్చీలోంచి విసురుగా లేచిన స్వప్నను చూస్తూ, 'ప్లీజ్! నే చెప్పేది పూర్తిగా వినండి. కూర్చోండి' అన్నాడు ఎంతో సౌమ్యంగా గోపీ.

'ఒక్కోసారి హర్ష, మిమ్మల్ని చూస్తే అసూయపడిన సందర్భాలూ ఉన్నాయి. అయితే అనుకోకుండా ఈ బిజినెస్ ప్రారంభించడం మీరు యిక్కడ చేరడం నా అదృష్టం. రోజులో కొన్ని గంటల పాటు మిమ్మల్ని చూసే భాగ్యం నాకు కలిగింది. మీకు విడమరచి చెప్పాల్సిన అవసరం లేదు. మీ అవసరాలు నేను తీర్చగలను. ప్రతి నెలా యిలాంటి చెక్స్ అందుతూనే ఉంటాయి. మనం మనుషులం కదా! ప్రేమనూ అణుచుకోలేం,




**పిడుగుల నుంచి..**

'స్టార్మ్అలెర్ట్' మీ మీద పిడుగులు పడకుండా మీరు జాగ్రత్త పడేందుకు ఉపయోగపడుతుంది. నేలని తాకినప్పుడు ఏర్పడే 'రేడియో ఫ్రీక్వెన్సీ సిగ్నల్స్'ని ఈ 'స్టార్మ్ అలెర్ట్' వెంటనే కనిపెట్టి, 'అలారమ్' ద్వారా ఆత్మరక్షణకి హెచ్చరిక సొంజ్ఞలు పంపుతుంది.

-బి. ఆర్. సుంకర

కోరికనూ అణుచుకోలేం! మీరేమంటారు?' అన్నాడు గోపీ ఆమెనే పరిశీలనగా చూస్తూ.

'మీరు చెప్పడం అయిందా? యింకా ఎవయినా ఉందా?'

'నేను యింతకాలం మనసులో దాచుకున్నది ఈరోజు చెప్పేశాను. సమాధానం చెప్పాల్సింది మీరు' అన్నాడు తమాషాగా నవ్వుతూ.

'మీరు, హర్ష మంచి స్నేహితులు, ఓ స్నేహితుడి భార్యగా నన్ను మీరెలా చూసింది యిప్పుడే అర్థమయింది. మీరు స్నేహాన్ని దైవత్వాని కెత్తడానికి ప్రయత్నించండి. పెళ్ళయిన ఆడదాని మీద అర్థం లేని ప్రేమతో, విరహంతో కాలి మసై గాలిలో కలిసిపోతాననడం కేవలం ఆత్మ వంచన. నేను భద్రతని కోరుకుంటాను. ప్రతి ఆడదీ అదే కోరుకుంటుంది కూడా! నాది, హర్షతో భద్రత గల సుఖ జీవనం. నేను హర్ష ప్రేమనే అవధిగా, కర్తవ్యంగా, ఆశయంగా కూడా భావిస్తున్నాను. వీట న్నిటికీ మించి ఆయన నా భర్త. ఇప్పుడు మీకిచ్చింది లీవ్ లెటర్. దాన్నే రిజిగ్నే షన్ లెటర్‌గా భావించండి. థాంక్స్ - ఐవిల్ నెవర్ సీ యూ ఎగైన్' విసురుగా లేచి గబగబా అడుగులు వేస్తూ వెళ్ళిపోతున్న స్వప్నను చూస్తూ నోరు తెరిచాడు గోపీ.

☆ ☆ ☆ ☆

'నీలో యింత పంతం, మొండితనం ఉంటుందని ఊహించలేదు స్వప్నా' అన్నాడు హర్ష.

'ఏం పంతాలు పట్టింపులు మగాళ్ళకేనా? ఆడవాళ్ళకు ఉండకూడదా?'

'రెండు నెలలుగా తిరుగుతున్నావ్. ఆ చెక్ మారదు. దాని విషయం మర్చిపో.'

'దాన్ని మార్చి తీరతాను. అలా మారకపోతే పోలీస్ కంప్లైట్ యిస్తాను.'

'సరే నీ యిష్టం. నేను రేపు క్యాంప్ కెళితే నాలుగు రోజులు రాను. నువ్వు కాస్త మామూలు మూడ్‌లోకి వస్తే సంతోషిస్తాను.'

"అయ్యయ్యో! ఆ విషయమే మర్చిపోయాను. సారీ అండీ!' అంది స్వప్న.

హర్ష మర్నాడు ఊరికి వెళ్ళిపోయాడు. స్వప్న బ్యాంక్‌కి వెళ్ళింది. స్వప్న అలా గత రెండు నెలలుగా రోజు విడిచి రోజూ వెళ్ళడంతో అక్కడి లేడీ కేషియర్‌తో పరిచయం అయింది. కొంతవరకు స్వప్న వివరాలు చెప్పింది కూడా!

ఆ బ్యాంక్‌లో గోపీకి పర్సనల్ అకౌంట్ వుంది. సంవత్సరంలో ఒకటి రెండు సార్లు మాత్రమే ఎమౌంట్ వెయ్యడం, ఆ తర్వాత రెండు రోజులకు చెక్ యిస్యూ చేయడం చేస్తూంటాడనీ, అతని అకౌంట్‌లో మినిమమ్ బ్యాలన్స్‌కు మించి ఒక్క రూపాయి కూడా ఉండదని కేషియర్ వివరంగా చెప్పింది.

ఆ వివరం విన్న తర్వాత స్వప్నలో మరింత పట్టుదల పెరిగింది. స్వప్న రావడం చూసిన కేషియర్ పలకరింపుగా నవ్వి, 'మీరు చాలా అదృష్ట వంతులు. మొన్న మీరు వచ్చి వెళ్ళాక గోపీగారు వచ్చి ఐదు వేలు అకౌంట్‌లో వేశారు. మీరు డ్రా చేసుకోవచ్చు' అంది.

స్వప్న దగ్గర ఎనిమిది వేలకు చెక్ వుండడం, అకౌంట్‌లో ఐదువేలే ఉండటంతో ఏం చెయ్యాలో తోచలేదు. ఈ అవకాశం వదులుకుంటే మళ్ళీ రాకపోవచ్చు.

కాషియర్ మిత్రురాలితో మళ్ళీ వస్తానని చెప్పి, రకరకాల ఆలోచనలతో బయటకు వచ్చింది స్వప్న. సమయానికి హర్ష కూడా లేకపోవడంతో చిరాకనిపించింది.

నిస్సహాయంగా యింటికి చేరిన స్వప్న ఆలోచనలు గజిబిజిగా మారాయి. అలా ఎంతసేపు ఆలోచిస్తూండిపోయిందో తెలీ లేదు. హఠాత్తుగా ఓ ఆలోచన మెరుపులా మెరిసింది. ఆ మెరుపు ఆలోచనకు వెన్ను జలదరించింది. అంతలోనే ఆమెలోని పట్టుదల నరనరాన పాకింది.

తన దగ్గరున్న ఎనిమిది వేల చెక్ మారాలంటే, తనే గోపీ అకౌంట్‌లో మూడు వేలు కట్టి ఈ చెక్ ప్రజెంట్ చేయాలి.

తను మూడువేలు కట్టాలంటే - రెండు చేతులతో కణతలు గట్టిగా నొక్కుకుంటూ కళ్ళు మూసుకుంది.

స్వప్న కళ్ళల్లోంచి రెండు కన్నీటి చుక్కలు చెక్కి మీదకు జారాయి. పెరిగిన గుండె వేగాన్ని అదుపు చేసుకుంటూ లేచి నిలబడింది. వణుకుతున్న చేతులతో మంగళసూత్రాలను గట్టిగా పట్టుకుని కళ్ళకు అద్దుకుంది.

అమీబా ప్రొటియస్‌లా క్షణానికో ఆకారం మార్చుకునే గోపీలాంటి వ్యక్తులకు స్వప్న యివ్వబోయే ట్రీట్ జీవితాంతం గుర్తుండిపోవాలి. అదే ఆలోచన స్వప్న మెదడు పొరల్లో శతఘ్నులు పేలుస్తున్నప్పుడు, పట్టుదల పెదవి అంచున నిలబడి పళ్ళ మధ్య బిగిసిన క్షణంలో స్వప్న మెడలోని బంగారపు నానుతాడు స్థానంలో స్వచ్ఛమూ, పవిత్రమూ, జీవిత బంధంగా నిలిచే మూడు ముడుల పసుపుతాడు ఆమె గుండెల మీద వేలాడుతూ ధైర్యాన్ని యిచ్చింది.

స్వప్న వాచీ చూసుకుంటూ వడివడిగా మార్వాడి కొట్టువైపు అడుగులు వేసింది.

✲





**మిలాన్‌లో 'మోషినో ఫ్యాషన్ షో'**

1994 వింటర్ సీజన్‌కి మీరు షాపింగ్ చెయ్యాలనుకుంటే మిలాన్ (ఇటలీ) లోని 'మోషినో' షాపింగ్ సెంటర్‌ని మరిచిపోగూడదు. కొత్త సంవత్సరంలో అద్భుతమైన కొత్త కొత్త డిజైన్లలో దుస్తులు తయారు చేసామని ఈ ఫ్యాషన్ షో నిర్వాహకులు అంటున్నారు. ఈ దుస్తుల్ని చూసినవారికి ఇలాంటివి తప్పకుండా కొనాలనే కోరిక కలుగుతుందనీ అంటున్నారు. ఈ దుస్తులలో మేరీ ఏంటీరెడ్‌యోనెట్ శైలి సిల్క్ గౌన్స్, తళతళలాడే విగ్, రెడ్ ఇండియన్ సేనానాయకుని ఆర్మీయూనిఫాం వంటి డ్రెస్ ఫెదర్ డెకొరేటెడ్, కౌగౌన్, జెట్ విమానం డిజైన్ హేట్, వంటి వినాయిల్ బ్లాక్ స్ట్రాప్ డ్రెసెస్ మొదలైనవి చాలా ఉన్నాయి. చిత్రాలలో (ఎడమవైపు) కౌగౌన్, (మధ్య) జెట్ వైనర్ హేట్.

-సుంకర